


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## "బల్లే బల్లే"గా పెళ్ళి చేసి చూడు....2

**పెద్దబ్బాయి** అశ్విన్ పెళ్ళికి నాకు ఆత్మీయులైన ఇండస్ట్రీ పెద్దలు అందరూ తరలి వచ్చారు. అల్లు అరవింద్‌గారు సతీ సమేతంగా అందరికన్నా ముందే వచ్చారు. పరుచూరి గోపాలక్రిష్ణగారూ, వారి సతీమణీ, కోడి రామక్రిష్ణగారూ, సత్యానంద్‌గారూ, సాయికుమర్, అవసరాల శ్రీనివాస్, డైరెక్టర్ శివనాగేశ్వరరావుగారూ, కాశీ విశ్వనాథ్‌గారూ, నటీమణులు ఢిల్లీ రాజేశ్వరీ, కవిత, కవి చైతన్య ప్రసాద్, మా చంద్రసిద్దార్థ, వి.ఎన్.ఆదిత్య, సిరివెన్నెలన్నయ్యా, మా అమ్మ తన పెద్ద కొడుకు అని చెప్పుకునే భువనచంద్రగారూ, నందమురి లక్ష్మీ పార్వతిగారూ, మా డాక్టర్ స్నేహితులు డా, పద్మ వీరపనేని, డా.ఆర్.టీ.ఎన్.నాయక్, డా. మోహన్‌వంశీ, మా పబ్లిషర్ సాహితీ లక్ష్మీ, రచయిత్రులు పొత్తూరి విజయలక్ష్మి కుటుంబం, సంధ్య గొల్లమూడి, మా తోడూ నీడా రాజేశ్వరిగారూ కొందరు టి.వి నటులూ, ఎందరో బంధువులూ, మంచి కోలాహలంగా వుంది వాతావరణం.

ప్రొద్దుట ఎదుర్కోలులో భువనచంద్ర గారు తెలుగూ, హిందీ పాటలతోబాటు మలయాళీ పాటకూడా పాడి వారిని అలరించారు. ఇటు మా అక్క చెల్లెళ్ళూ, అన్నదమ్ములు కూడా అందరూ 'పాడువారే' లెండి. పానకం కూడా నేనే కలుపుకెళ్ళి, ఎదుర్కోలు అంటే ఏమిటో మా మలయాళీ వియ్యాలవారికి చెప్పి సందడిగా జరిపించాం.

అందరి ఆశీర్వాదాలతో అశ్విన్, అనురాధల వివాహం అయి, ఏడాదికల్లా వారికో పండంటి బిడ్డ మా ధృవ పుట్టాడు.

కానీ బాధ్యతలు తీరలేదుగా.

క్రిష్ణ ఎం.ఎస్ పూర్తి అయి వాడికి ఉద్యోగం రావడంతో వాడికీ సంబంధాలు చూడడం మొదలు పెట్టాను.

"అన్నయ్య విషయంలో ఫెయిల్ అయ్యావు, నా విషయంలో అయినా పాస్ అవుతావా" అని వాడు అడుగుతూనే వున్నాడు.

పాపం నేను సంబంధాలు చూసి, ఏ అమ్మాయితోనైనా ఫోన్ చేసి మాట్లాడమంటే చిన్నవాడు, పెద్దవాడిలా మొండి చెయ్యలేదు. అలాగే మాట్లాడేవాడు. ఒక సంబంధం ఆల్‌మోస్ట్ కుదిరింది అనుకున్న తరుణంలో తప్పిపోయింది. వాళ్ళ అమ్మ నాకు ఫ్యాన్. ఎంత మురిసిపోయిందో నాతో వియ్యం అందడానికి. అమ్మాయికి కూడా అబ్బాయి నచ్చేసాడు. కోవిడ్ రోజులు. మా వారికి ఒంట్లో బాగోలేదు. ఈ సంబంధం కుదిరిపోయింది గట్టున పడిపోయాం అనుకుంటుంటే ఒకనాడు నా ఫ్యాన్ కాకుండా ఆమె భర్త, అంటే పెళ్ళి కూతురి తండ్రి కాల్ చేసి "మా సిద్ధాంతి నాడులు కుదరలేదు అంటున్నాడు అండి.. ఏం అనుకోకండీ" అన్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయినా, గొప్ప సమన్వయంతో "సిద్ధాంతులు కాలజ్ఞానులు. నేను వారి మాట కొట్టి పారెయ్యను. కానీ మీ సిద్ధాంతి ఈ కోవిడ్ అనే మహమ్మారి రాబోతోందని మీకు చెప్పాడా? కనీసం మీ ఒక్క కుటుంబానికైనా చెప్పాడా? చెపితే ఆయన మాట నమ్ముదాం" అన్నాను. గుడ్డిగా సిద్ధాంతులనీ, బాబాలనీ నమ్మే రకాలకి లాజిక్‌లు వుండవు. అలా ఓ సంబంధం కుదిరింది అన్నది తప్పిపోయింది. ఇలా రెండు మూడు నేను ఫెయిల్ అయ్యాక, ఫెయిల్ అయ్యానని ఒప్పుకోడానికి నేనేం సిగ్గుపడలేదు.

మా క్రిష్ణకాంత్‌తో "నీ సంబంధం నువ్వే చూసుకో" అన్నాను.

ఓ శుభ సందర్భాన "అవియల్, ఆపం, ఇడియాపం పుట్టూతో బాటు పంజాబీ పరోటా, చోలే బటూరా చేసే పంజాబీ అమ్మాయిని ఇష్టపడ్తున్నాను. నీకు ఓకేనా" అని గగన్ కౌర్ ఫోటో పంపాడు.

నాకు చూడగానే తెగ నచ్చేసింది పిల్ల.

వాళ్ళు పంజాబీస్ మాత్రమే కాదు 'సిఖ్'లు కూడా. 'సిఖ్'లు అంటే నాకు గొప్ప గౌరవం. పంజాబ్ సిక్కుల్లో ఇంటికి ఒకరైనా ఆర్మీ సర్వీసులోకి వెళ్తారు. అక్కడ ఆడపిల్లలు, ట్రాక్టర్లు నడుపుతూ, గొప్ప కార్యశూరత్వం కలిగివుంటారు. ముఖ్యంగా మన ఆంధ్రావాళ్ళ లాగే తిండికీ, రుచికీ అధిక ప్రాముఖ్యతనిస్తారు. ఇవీ కారణాలు.

ఘోరమైన కోవిడ్ కాలం. నేను ఫ్లయిట్స్ స్టార్ట్ అవగానే పెట్టె సర్దుకుని కూర్చున్నాను. మా పెద్ద అబ్బాయి అశ్విన్ తమ్ముడితో చెప్పాడు "చూడు! అమ్మకి అవమానం కలగకూడదు .వాళ్ళు ఇష్టపడి ఈ పెళ్ళి చేస్తామంటేనే, వాళ్ళ ఇంటికి అమ్మని తీసుకెళ్ళాలి" అని.

నేను భయంకరమైన కోవిడ్ టైంలో 2021 డిసెంబర్ 20వ తారీఖున సియాటిల్ ప్రయాణం అయ్యాను.

ఎమిరేట్స్ బిజినెస్ క్లాస్ కాబట్టి ప్రయాణం చాలా సౌకర్యంగా జరిగింది.

వచ్చిన రెండో రోజు నాకు బూస్టర్ షాట్ వేయించాడు మా అబ్బాయి. ఆ రాత్రి క్రిస్‌మస్ పెరేడ్ చూసి రెస్టారెంట్‌కి వెళ్ళొచ్చాం. ఆ మరునాడు కాబోయే కోడలు గగన్ ఒక పుష్పగుచ్చం తీసుకుని నన్ను చూడ వచ్చింది. ఇద్దరం

కౌగలించుకున్నాం. ఆ అమ్మాయి మాటలకి నా మనసెంతో ఆనందించింది. హయత్‌లో టేబుల్ రిజర్వ్ చేయించాడు మా క్రిష్ణ. ముగ్గురం వెళ్ళాం. నాకు చలీ, వణుకూ.

గగన్ మావాడి చెవిలో "మీ అమ్మకి కంఫర్టబుల్‌గా లేనట్టుంది" అంది.

"అవునా?" అని నన్ను పట్టుకుని ఇంటికి తీసుకొచ్చాడు. అంతే. ఆ రాత్రి అంతా జ్వరం. బూస్టర్ షాట్‌వల్ల అనుకున్నాం. మర్నాటికి గొంతు నొప్పి, దగ్గు. లాభం లేదని తీసుకెళ్ళి కోవిడ్ టెస్ట్ చేయించాడు. పాజిటివ్ వచ్చింది. నా గుండెల్లో రాయి పడింది. దేశంకాని దేశంలో నా పరిస్థితేంటి అని.

మరునాటికి మా అబ్బాయికి కూడా వచ్చేసింది. పదిరోజులు జైలు జీవితం గడిపాం. ఆన్‌లైన్లో దొరికిన సరుకులే వండుకు తిన్నాం. రోజూ ఫోన్ చేసి "ఇంకా కాబోయే వియ్యాలవారి ఇంటికి వెళ్లలేదా? త్రిపాది లక్షణాలున్న నువ్వు ఇంట్లోనే కూర్చున్నావేంటి? అని అడిగే మా ఆయనకి ఏవేవో జవాబులు చెప్పానే కానీ కోవిడ్ అని చెప్పలేదు.

మొత్తానికి జనవరి 15వతేదీన ఆ శుభఘడియలొచ్చి, వియ్యాలవారిని కలిసే తరుణం ఆసన్నం అయింది.

"మా కాబోయే మావగారు అదో టైప్. మనం, తెలుగు మాట్లాడతాం అంటే, మద్రాసీలు కదా అంటాడు. దేవుడిని నమ్మడు. ఆచారాలు నమ్మడు. సౌత్ ఇండియా వాళ్ళని నమ్మడు" ఇలా ఏమేం నమ్మడో మా అబ్బాయి పెద్ద లిస్ట్ చెప్పాడు.

నేను భగవంతుడితో "నామీద నమ్మకం కలిగించు స్వామీ" అని దణ్ణం పెట్టుకున్నాను.

చీర కట్టుకుని నా స్టైలులో తయారయి బయలుదేరాను. గుండెలు పీచుపీచుమనడానికి కారణం, మా మధ్య వున్న 'మతం' మాత్రమే కాదు, వారి ఆస్తిపాస్తులు కూడా. వాళ్ళకి 12 గ్యాస్‌స్టేషన్లున్నాయి. ఫార్మ్ హౌస్, స్వంత ఇళ్ళూ ఉన్నాయి.

సియాటిల్ నగరంలో "తేరా పాస్ క్యా హై?" అంటే, మా అబ్బాయి "మేరే పాస్ మా హై" అని దీవార్‌లో అమితాబ్‌లా అన్నాడు.

"మేరే పాస్ పెన్ హై" అని నేను అనాలనుకున్నాను.

తలుపు తియ్యగానే మా మీద గులాబీ పూరెక్కలు జల్లుతూ ఇంటిల్లిపాదీ ఘన స్వాగతం చెప్పారు. చరన్‌జిత్ సింగ్, నిర్మల్ కౌర్‌లు అనబడే గగన్ తల్లితండ్రులకి ఎందుచేతో నామీద అపరమిత అనురాగాలు కలిగాయి చూసిన క్షణాన. గగన్ చెల్లెలు హర్ మీందర్, తమ్ముడు నేతన్, అమ్మమ్మ గుర్‌మీజ్ కౌర్‌లు కూడా చాలా ప్రేమగా రిసీవ్ చేసుకున్నారు.

బీబీ అని పిలువబడే 91 సంవత్సరాల గుర్‌మీజ్ కౌర్ అనబడే పెద్దావిడ ఇప్పటికీ వంట చేస్తారు. ఇంట్లో మక్కన్ తీసి, నెయ్యి చేస్తారు. మనం అనుకున్నదానికి మూడింతలు తినేలా చూసే చాకచక్యం, నైపుణ్యం వల్ల, మా అబ్బాయి పాపం ఎన్ని జిమ్ లకి వెళ్ళినా బరువు తగ్గించుకోలేకపోతున్నాడు. వాడి భాషలో "నేను ఒక్కడినే వుండేవాడిని. బీబీ నన్ను ఇద్దరుగా మార్చింది. ఆమె ప్రేమని మక్కన్, దహీ, ఘీ గా మార్చి, మన షేపులు మార్చగలదు" ఇది రిసెప్షన్‌లో చెప్పాడు క్రిష్ణ.

ఇక ఇంటిపెద్ద చరన్‌జిత్, ఈయన భోళా పెద్ద మనిషి, ఎదుటి వారిని ప్రేమిస్తే దానికి అవధులు లేవు. ఆయనకి నన్ను చూసాక సౌత్ ఇండియన్స్ అందరూ 'మద్రాసీలు' కారు తెలుగూ, కన్నడా, మలయాళీలు కూడా వుంటారని నమ్మకం కుదిరింది.

నిర్మల్.. మా వియ్యపురాలు అనికాదు. ఒక స్త్రీగా ఈమెని చూస్తే గర్వం కలిగింది. ఏమీ పెద్దగా చదువుకోకుండా, ఫగ్ వాడా నుండి వచ్చి ఇక్కడికి రాగానే డ్రైవింగ్ నేర్చుకుని భర్త ఉద్యోగం చేస్తుండగా ఒక షాప్ ప్రారంభించి, ఆ తర్వాత వ్యాపారాన్ని విస్తరించి, భర్తకి చేదోడుగా కాకుండా తనే మొత్తం చూసుకునే స్థాయికి ఈ పరాయి దేశంలో ఎదగడం అభినందనీయం.

ఇక పిల్లలు, మినీ, నేతన్ ఇంకా చిన్నవాళ్ళు. నేతన్ కరాటేలో బ్లాక్ బెల్ట్. గగన్ పియానో, మినీ జాజ్, నేతన్ గిటార్ వాయిస్తారు .సరస్వతీ నిలయంలా వుంటుంది వాళ్ళ రూం.

మర్యాదలంటారా... వెళ్లగానే మనకి ముందు జ్యూస్ కానీ లస్సీ కానీ వస్తుంది పెద్ద సైజ్ గ్లాస్‌లతో, తర్వాత పకోడీలు, ఆ తరువాత డిన్నర్ అంటారు. పెద్ద పెద్ద బటూరాలూ, చోలే, 'చోల్ ' అంటారు పులావ్‌ని. అలా తప్ప మన రైస్ తినరు. స్టిక్కీ రైస్ అని పేరు మనం తినే అన్నానికి. వారికి మెతుకు, మెతుకు అంటుకోకూడదు. ఆ పులావ్‌లోకి రైతా, దాల్, (చింతపండు అనేది తినరు) కడి చాలా చేస్తారు. భోజనానంతరం స్వీట్ వుంటుంది. గులాబ్ జామూన్ కానీ గాజర్‌హల్వా కానీ ఖీర్ కాని.

చాయ్ ఇవన్నీ అయ్యాక ఇస్తారు.

తిండి తర్వాత పెళ్ళి ప్రహసనం వచ్చింది. మాకైతే ఆ మార్చ్‌లో అంటే 2022న చెయ్యాలని వుంది. కానీ పిల్లలు పడనియ్యలేదు. 2023 తర్వాత అన్నారు. ముహూర్తాలు పెట్టిస్తే సరి అనుకున్నా. అదంత ఈజీ ఏం కాదు.

అమ్మాయి తల్లితండ్రులకి మీ డబ్బులు ఖర్చు చేస్తే నేను పెళ్ళే చేసుకోను అని ఆంక్ష పెట్టింది. ఇద్దరూ కలిసి ఇల్లుకొనుక్కుని ఆ తరువాతే పెళ్ళి చేసుకుంటాం అన్నారు.

ఆ అమ్మాయిని ఆమె తల్లితండ్రులు దేనికీ సరే అనిపించలేకపోయారు. ప్రిన్సిపుల్డ్ గర్ల్. ఐ లైక్డ్ హర్.

నేను క్రిష్ణ హిందూ టెంపుల్‌కి వెళ్ళి వాసు దేవశర్మగారితో మార్చ్ 16 2023 న పొద్దున్న పదింపావుకి ముహూర్తం పెట్టించాము. తరువాత 17న జాగో నైట్, 18న గురుద్వారా పెళ్ళి, అదే నాటి రాత్రి రిసెప్షన్ అని నిర్ణయించాం.

2022 ఫిబ్రవరి నాడు, వేట మొదలుపెట్టినా 2023 మార్చ్‌కి ఒక్క పెద్ద హోటల్ కూడా ఖాళీ లేదు. కోవిడ్ వల్ల ఆగిపోయిన పెళ్ళిళ్ళు అన్నీ అప్పుడు వరుస కట్టి మొదలవుతున్నాయి మరి.

వీడియో కాల్‌లో మా ఇంటిల్లిపాదినీ కలిసి గగన్ తల్లితండ్రులు చాలా ఆనందించారు.

'కొడమణీ' అంటే వియ్యపురాలిగా నన్ను చాలా గౌరవించారు.

"మీకు ఏమేం ముచ్చట్లు జరగాలో చెప్పండి. పంజాబీ సంబంధం చేసుకున్నారని ముక్కు కోసినట్లు వుండకూడదు. అన్నీ వివరంగా చెప్పమని" పదే పదే అడిగారు.

"మీరు పిల్లని ఇవ్వండి చాలు. పిల్ల చేతిలో కొబ్బరి బొండాం కూడా మేమే తెచ్చుకుంటాం" అని చెప్పాను.

2022 జూన్ 8న నేను వెనక్కి ఇండియా వస్తే, ఇంకో మూడు నెలల తర్వాత వీసా స్టాంపింగ్‌కి మా క్రిష్ణ వచ్చేట్లూ, అక్టోబర్ 2022న గగన్, వాళ్ళమ్మా పెళ్ళి షాపింగ్‌కని ఇండియా వచ్చి ఫగ్వాడాలో వారం, హైదరాబాద్ మా ఇంట్లో వారం వుండి, వెళ్ళేటప్పుడు క్రిష్ణ వాళ్ళతో వెళ్ళేటట్లూ మాట్లాడుకున్నాం.

ఈలోగా రిజిస్టర్ మ్యారేజ్ చేయించేసిరా.. అనుకున్నాక సంవత్సరాలు గేప్ ఎందుకు? అని మావారు అన్నారుకానీ, మా క్రిష్ణ 'అన్నా, వదినా, వాళ్ళ బాబూ, నేనూ, మావారూ లేకుండా ఏ పెళ్ళికీ ఒప్పుకోలేదు. నాకు ఇంకో 'శంక' అది వాడి వడుగు 'కాలేదు' అందుకే రెట్టించలేదు.

అక్టోబర్‌లో వస్తానన్న క్రిష్ణ జూలైలోనే వచ్చేసి, మాకు పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చాడు. సెప్టెంబర్ 12న వాడి వీసా స్టాంపింగ్.. 3న 'వడుగు' ముహూర్తం పెట్టించాను.

పెళ్ళికి రావడానికి నాకూ మా వారికీ, మా పెద్దబ్బాయికీ, కోడలుకీ వీసాలున్నాయి. మనవడు 3ఏళ్ళ వాడికి వీసా స్లాట్ దొరకడం బ్రహ్మ ప్రళయం అయిపోయింది. వాడికి రాకపోతే వీళ్ళు రాలేరు. నా భయం ఏమని చెప్పను. భయంకరంగా సినిమాల్లో అంజలీదేవిలూ, శాంతకుమారిలూ వాళ్ళు దేవుడి ముందు కూర్చుని పూజలు చేస్తారే గంటలు అన్నీ గణగణమని మోగిపోతూ. అమ్మవారికీ, శివయ్యకి కైలాసంలో, మంచు పర్వతంలో సైతం, రాజమండ్రిలో ఒళ్ళంతా వేసవి వేడికి పేలిపోయినా, చుక్క నీరు స్నానానికి దొరకని వాళ్ళలా చిందులేస్తారే.. అలాంటి సీనే. అన్ని పూజలు చేసేసరికి బుడ్డాడికి జనవరి 3న చెన్నైలో వీసా స్లాట్ దొరికింది. అమ్మయ్య పూజలు ఫలించాయి అనుకుని స్థిమితంగా, బంధువులని మాత్రం పిలుచుకుని ఇంట్లోనే వడుగు చేసేసాం. అదంతా లాప్ టాప్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చూసింది గగన్.

మా వంట లక్ష్మి గారి కేటరింగ్‌లో బూరెలూ, పులిహోరా, వంకాయకూర, ఆలూ ఫ్రై, ముక్కల పులుసూ, బజ్జీలూ, గోంగూరా, టమాటా పచ్చడులూ అన్నీ అదిరిపోయాయి.

నా పూజల మహత్యం వల్ల క్రిష్ణకి వీసా స్టాంపింగ్ జరిగింది.

కానీ అన్నీ మనం అనుకున్నవి అనుకున్నట్లయితే ఆ 'పై' వాడెందుకూ? ఆయన ఉనికిని మనకి చాటకపోతే. మనంతవాళ్ళం లేం అనుకుంటాం.

సెప్టెంబర్‌లో వడుగు అయ్యాక మళ్ళీ స్కాన్‌లో మా వారికి అస్వస్థత కనబడింది. అక్టోబర్‌లో గగన్, నిర్మల్ వస్తున్నారు. ఎంతో నిబ్బరంగా అన్నీ బాబామీద వేసి ముందుకి నడిచాను.

నా భర్త తన బాధ ఒక్కనాడు బయటకి చెప్పలేదు. గొప్ప ఆత్మ స్థైర్యంతో భరించారు.

అక్టోబర్‌లో ఫగ్వాడాలో పెళ్ళికూతురు కాలుమోపింది.

మా అశ్విన్, క్రిష్ణా డ్రెస్సెస్ సెలెక్షన్‌కి పంజాబ్ వెళ్ళారు. గొప్ప ఎదుర్కోలు అట అక్కడ మాపిల్లలకి చండీఘడ్‌లో.





మా వియ్యపురాలి షాపింగ్‌కి, చీరలూ, డ్రస్సులూ చూపించి చూపించి, ఒకటి రెండు అర్భకపు వికెట్లు డౌన్ అయ్యేవుంటాయి పాపం. గోనె సంచుల నిండా షాపింగ్ చేసిన పాకెట్లతో, వాళ్ళు కనబడకుండా ఆటోలలో ఫోటోలు పెట్టింది.

ఇంక వాళ్ళు పెట్టే తిండికీ, "బల్లే బల్లే" డాన్స్ లకీ మా పిల్లలు అదిరిపోయారు. స్వర్ణ దేవాలయం కూడా చూసుకుని, హైదరాబాద్ వచ్చారు.

నేనూ, మా పెద్ద వియ్యపురాలు దేవకీ, నిర్మల్‌ని చార్మినార్, ఆబిడ్స్, బేగం బజార్లలో మా యధాశక్తి షాపింగ్ చేయించాం. ఇక్కడా షాపుల్లో సేల్స్ బాయ్స్ అనే అర్భకపు వికెట్లు ఒకరో ఇద్దరో డౌన్ అయ్యాక వీళ్ళ షాపింగ్ ముగిసింది. పరోటాలు చెయ్యడానికి మా అబ్బాయి ఇంట్లో మాస్టర్ షెఫ్ కిరణ్ వుంది కాబట్టి పెద్ద ప్రోబ్లం రాలేదు.

తెలుగుపెళ్ళి అలంకరణ, తెలుగు పెళ్ళిలో ఘట్టాలు ఇలా అన్నీ నోట్స్‌లు ప్రిపేర్ చేసి ఇచ్చాం.

వాళ్ళు జాగోలకి డిజేలని మాట్లాడుకుని, హోటల్స్ బుక్ చేసుకుని, కేక్‌ల తయ్యారీవాళ్ళని, మేకప్ విమెన్‌ని, శారీ డ్రేపర్స్‌ని కేటరర్స్‌ని.. వాళ్ళ హడావిడిలో వాళ్ళు వుండగా, మా ధృవ బాబుకి వీసా వచ్చేసింది. మొదట నా ప్రయాణం 2023 ఫిబ్రవరి 20నీ, మార్చ్ పదిన మా ఆయనా, పెద్దబ్బాయి కుటుంబం రావడానికి సూట్‌కేసులు నింపేసుకున్నాం.

పెళ్ళి అంటే, అందులోనూ ఎత్తి వచ్చి పరాయిదేశంలో చెయ్యడం అంటే ఎన్ని చూసుకోవాలీ.

చెంబులు, పళ్ళాలు, పావుకోళ్ళు, ఉత్తర జంధ్యాలు, అమ్మాయి వచ్చినప్పుడు కొన్న బంగారం, పుస్తెలు, మెట్టెలు..నాకు వీలైనన్ని, పెళ్ళికొడుకుని చేసే, తిలకం, పారాణికి సున్నం సీసాతో సహా మోసుకొచ్చాను. మెయిన్‌గా అందరికీ కొన్న పట్టుచీరలూ.. ఇక్కడొక విషయం చెప్పాలి. ఎంత ముచ్చటగా పట్టుచీరలకీ, మధుపర్కానికీ వాళ్ళు కుచ్చీళ్ళు పెట్టించి, రెడీమేడ్‌గా, డాన్స్ డ్రెస్‌లా తొడుక్కునేట్లు చేయించి తెచ్చుకున్నారో. భలే బావున్నాయి.

ఫిబ్రవరి 21న అలా మొదటి బారాతీగా నేను సియాటిల్‌లో అడుగు పెట్టాను. మా అబ్బాయీ, కాబోయే కోడలూ కేక్ టేస్టింగ్ అనీ, ఫ్లవర్ డెకరేటర్‌తో మాట్లాడాలనీ, లిన్‌వుడ్ రిసార్ట్స్‌లో ఫుడ్ టేస్టింగ్ అనీ, రోజూ ఏదో ఒక చోటుకి తీసుకెళ్తూనే వున్నారు.

మా అబ్బాయి రెండు 'ఎయిర్ బి ఎన్ బి'లు బుక్ చేయించాడు. ఒకటి ఇంట్లో వాళ్ళకీ వచ్చే మా బంధువులకీ. రెండోది వాడి ఫ్రెండ్స్‌కి అనీ.

మార్చ్ 10న నేనూ, మా క్రిష్ణా బెల్‌వ్యూలో వుంటున్న ఇల్లు ఖాళీ చేసి, కర్క్‌లాండ్‌లో వున్న ఎయిర్ బి ఎన్ బీకి మూవ్ అయ్యాం.

ఆ ఇంట్లో సామాన్లు అన్నీ మా గగన్, వాళ్ళ చెల్లెలు 'మీనీ' మోసుకుంటూ వెళ్ళి, వ్యాన్ ఎక్కించి వాటిని వాళ్ళ గారేజ్‌లో పెట్టారు. నేను చెప్పానుగా మొదట్లోనే పంజాబీ 'కుడీ'ల బలసాహసాలు వేరే లెవెల్.

పదకొండున బయల్దేరి మా పెద్దబ్బాయి, కోడలూ, మనవడూ, మా వారూ వస్తారు అని మేం చాలా షాపింగ్ చేసాం.

ఎన్ని చేస్తున్నా నా వెన్ను నొప్పి, సియాటిల్ గాలీ, నీరూ పడక నా చర్మం, జుట్టూ పాడయిపోవడం నన్ను చాలా కలత పెట్టాయి.

అసలు నేను తెలుగు పెళ్ళి సమర్ధవంతంగా చెయ్యగలనా? మా కోడలికి, మనవడితోనే సరిపోతుంది. మావారు అంత ఆరోగ్యంగా లేరు అని తెగ విచారంగా వుండేది.

దగ్గర వాళ్ళనీ, తప్పక వస్తారు అన్నవాళ్ళనే పెళ్ళికి పిలిచాను.

మా డల్లాస్‌లో వుండే రమక్కా, శేషాద్రి బావగారూ, వాళ్ళ అమ్మాయి శైలూ. అసలు సందడంతా పెళ్ళిలో శైలూదే. అది మా కుటుంబంతోపాటు ఏడాదిగా ప్రిపేర్ అయింది ఈ పెళ్ళికోసం. మా లక్ష్మక్క కూతురు శేష శైలజా, సెంథిల్, వారి పిల్లలు అభిరాం, అదితిలు.

నా ఆప్తమిత్రులు కిరణ్‌ప్రభగారూ , కాంతి కిరణ్‌గారూ, వాళ్ళ అబ్బాయ్ జీవన్ కుటుంబం

మా పెద్దక్కలు లక్ష్మీ, శాంతిల ఫ్రెండ్ నాకూ అక్కలాంటి జానకీదేవీ, వాళ్ళాయన నారాయణమూర్తిగారు.

ఇక్కడ లోకల్ తమ్ముడు శ్రీరామ్ వేగరాజూ, వాళ్ళావిడ మాధురీ, పిల్లలూ.

అలాగే లోకల్‌గా వున్న మా వదినా వాళ్ళ అక్క కూతురు, మేనకోడలు శిరీషా, కుమార్ వాళ్ళ పిల్లలు,

క్రిష్ణ స్నేహితులు ధీరజ్, శీనూ, విష్ణూ, భరద్వాజ్, ఇంకో బెంగాలీ దంపతులూ, జపనీస్ అమ్మాయీ, ఇంద్రజా, భరత్, నిఖిలేష్, శ్రీకాంత్, అతని కుటుంబం, సౌరేష్, కిష్‌లయ్, అతని భార్య మల్లికా వీళ్ళంతా రాకపోతే అస్సలు సరదానే వుండేది కాదు.

పది రాత్రి నేనూ క్రిష్ణా విడిది ఇంటికి చేరితే, అదే రాత్రి సిన్‌సినాటీ నుండి ధీరజ్, కాలిఫోర్నియానుండి శ్రీను వచ్చారు. పదకొమ్డు తెల్లారగానే మా ధృవ బాబుతో మా కుటుంబం వచ్చింది.

13న శైలూ న్యూయార్క్ నుండి వచ్చింది. 14న రమక్కా బావగారూ డాలస్ నుండి వచ్చారు.

ఇంక పెళ్ళి సందడీ, లడ్డూలూ, కాఫీలూ, దోశలూ, వంకాయ కూరలూ, సాంబార్లూ .. ఇంట్లో ఘుమఘుమలే ఘుమఘుమలు. నేనూ అక్కా కొంగులు బిగించాం. పిల్లకాయలు డాన్స్ ప్రాక్టీసులు మొదలు పెట్టారు.

వియ్యాల వారింట్లో హల్దీ 15 పొద్దుటే, అందరికీ అక్కడే పలహారాలు, భోజనాలూ.



సాయంత్రం మెహందీ, భోజనాలకి ఏర్పాట్లు జరిగాయి.

డ్రెస్ కోడ్‌లు అంటూ పిల్లకాయలు ఊదర కొట్టారు.

నేనూ, రమక్కా మంచం నిండా చీరలు పరిచి, ఏం కట్టుకోవాలో ఆలోచించాం. అప్పుడు మాకు తీరిక చిక్కింది.

మార్చి 15న హల్దీతో పెళ్ళి సందడి మొదలయింది మా ఇంట్లో.

పెళ్ళివారమండీ అంటూ పసుపు బట్టల్లో మేం బయలుదేరాం.



అందరం డ్రెస్ కోడ్ పాటించి ఎల్లో ఎల్లోమని వెళ్ళాం. అప్పటికే వియ్యాలవారి ఇల్లు బంధువులతో హడావిడిగా వుంది. ఓ పక్క డాన్స్‌లు కూడా జోరుగా సాగుతున్నాయి. వాళ్ళ హాల్లో డైనింగ్ టేబుల్ నుండి కిందకి మెట్లుగా అమర్చి, సమోసాలూ, మురుకులూ, పకోడీలూ, జిలేబీలూ, గులాబ్‌జాంలూ, రకరకాల మిఠాయిలూ, ఓ పక్క చాయ్ అన్నీ అమర్చారు. మా అందరికీ ఫోటోలు తీసుకోడానికీ ఉపహారాలు తినడానికి టైం చాలలేదు. హల్దీ స్టార్ట్ అవుతోంది రమ్మన్నారు. మా కృష్ణ ఫ్రెండ్స్ అందరినీ 'బోయ్స్' అని పిలుస్తున్నాం. వాళ్ళకీ, శైలూకీ జరగబోయేది తెలిసినట్లుంది. మాకేం తెలీదు.

ఆరు బయట వెనకాల, పసుపుబట్ట దరివెంలా పట్టి, కింద పీటలు వేసారు. క్రిష్ణనీ, గగన్‌నీ కూర్చో పెట్టి మొదట మా నియర్ ఫ్యామిలీ మెంబర్స్, ఆ తరువాత వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్, ఆ తరువాత వచ్చిన బంధువులూ, స్నేహితుల చేత పసుపు నలుగులు పెట్టించారు.

నా మాట మీద మాధురి హల్దీ రోజున, తెలుగు పెళ్ళిరోజునా శెలవు పెట్టేసింది. మా శిరీష కూడా వచ్చింది. ఓ పక్క ఇది జరుగుతూ వుండగానే, బోయ్స్ బకెట్లతో పసుపు నీళ్ళు తెచ్చి, కృష్ణ మీద,గగన్‌మీదా, పసుపు నీళ్ళు పోసాక, వాళ్ళిద్దరినీ స్నానాలకి పంపించారు.

ఓ పక్క భోజనాలు జరుగుతుండగానే, ఇంకో పక్క మెహందీ అమ్మాయిలొచ్చి, మా అందరికీ మెహందీలు పెట్టడం మొదలు పెట్టారు. ఓ మెహందీ అమ్మాయి నన్ను దగ్గరకి పిలిచి "మీరు మదర్‌ఇన్‌లానా? గగన్ మీకు రెండు చేతులకీ, రెండు వైపులా మెహందీ పెట్టమంది" అంది.



నవ్వి "ఒకచేతికి చాలు" అన్నాను.

అందరి భోజనాలు అవగానే, కృష్ణ "ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకుని, ఫోటో సెషన్‌కి మళ్ళీ రావాలి" అని తొందరపెట్టాడు.

బోయ్స్ మటుకు ఏ మాత్రం ఖాళీ దొరికినా వాళ్ళు "నాటూ నాటు నాటు" స్టెప్స్, "రంజితమే"కి ప్రాక్టీస్ మానడం లేదు. వాళ్ళకిచ్చిన ఎయిర్ బి ఎన్ బీలో ఒక హాల్ ఐదు బెడ్స్ గుండ్రంగా వుండడంతో దాన్ని డోర్మ్ రూము అనీ, వాళ్ళని డోర్మ్ రూం బోయ్స్ అనీ శైలూ పిలుస్తోంది.

అందరం వచ్చి, కాసేపు నడుం వాల్చి, తిరిగి చీరలు మార్చుకుని తయారయి బయల్దేరే వేళకి మా కాంతిగారు కూడా, నేను పెట్టిన గగన్ వాళ్ళ ఎడ్రెస్‌కి వస్తున్నాననీ, జీవన్ దింపుతున్నాడనీ ఫోన్ చేసారు.

సో... మేం వెళ్ళేసరికే ఫోటో కమ్ వీడియోగ్రాఫర్ అతని టీముతో వచ్చి వున్నాడు. అతని పేరు కూడా గగన్.



కాంతిగారు రాగానే పైకి తీసుకెళ్ళి గోరింటాకు పెట్టించాను. నేనూ మా రమక్కా, గగన్ చేతులకి ఓ దానికి చార్మినార్, ఇంకో దానికి ఏదో టెంపుల్ అన్నీ లతలతో, డిజైన్స్ వేస్తూండడం చూసాం. ఆ వేసే అమ్మాయిలు తమిళ్ మాట్లాడారు.

క్రిందకి రాగానే ఫోటో సెషన్ అయింది. ఇటు మాతో ఫోటోలు అవుతుండగానే, శుశిక్షితులైన సైనికుల్లా డాన్స్ చేస్తూనే, నిర్మల్ అక్క కౌశల్, ఆమె ఇద్దరు కూతుళ్ళూ, నిర్మల్, బీబీ

అందరూ ప్లేట్స్‌లో ఫుడ్ సర్వ్ చేసారు. అంతకుముందే సమోసాలు, చాయ్‌లో తో తిని వున్నాం. డిన్నర్‌లో కాకరకాయ స్టఫ్ చేసిన విధానం మా అందరికీ బాగా నచ్చింది.

మొత్తానికి హల్దీ, మెహందీ అయి, మరునాడు ఉదయం తెలుగు పెళ్ళికి 8.30 కల్లా హిందూ టెంపుల్ దగ్గర వుండాలని అందరం చెప్పుకుని, మా విడిదులకి వచ్చేసాం.

ప్రొద్దుట 3గంటలకల్లా, మా శైలూ, నా కోడలు అనురాధ లేచి మేకప్ అమ్మాయిల ముందు కూర్చున్నారు. నేనూ మా అక్కా కొంచెం నాలుగుదాకా పడుకుని లేచాం. ఇంక స్నానాలూ, ఓ పక్క కాఫీలూ, మా మేకప్పులూ నడిచాయి. తరువాత ఎనిమిది గంటలకి ఇంటికి మాధురీ, శిరీషా వచ్చారు. క్రిష్ణకి తలకి నూనె పెట్టి, హారతిచ్చి మంగళస్నానానికి పంపాము.

ఆ తరువాత వాడికి శిరీష పారాణి పెట్టి కళ్యాణం బొట్టు పెట్టి, బుగ్గన చుక్క పెట్టి, పెళ్ళి కొడుకుని చేసింది. నేనూ, రమక్కా, మాధురీ, శిరీషా, మా అనూ అందరం హారతిచ్చాం.

అందరం టిఫిన్లు గుడి దగ్గరకే తీసుకు రమ్మని బోయ్స్‌కి చెప్పి సన్నాయి పెట్టుకుని, నాలుగు కార్లలో, శ్రీరామ్ వేగరాజు, మాధురీ కూడా రాబట్టి, శిరీష కారు, క్రిష్ణ కారు, ధీరజ్ కారుల్లో బయల్దేరిపోయాం. అంతలో శ్రీరామ్, మాధురీలు మా దంపతులకి పుట్టింటి కట్నాలు, బట్టలు పెట్టారు.



మేంలోపలికి వెళ్తున్నప్పుడే, ఫోటోలు తీసారు. ఆడపెళ్ళివారు, వాళ్ళకి అలవాటు లేకపోయినా చీరలు కట్టుకుని చక్కగా తయారయి వచ్చారు. ఇంక మా పెళ్ళి కూతురు నేను 'ముగ్ధా'లో కొన్న ఎర్రపట్టు చీరతో, పూలజడలో, పెళ్ళి కూతురి అలంకరణలో అచ్చం తెలుగు అమ్మాయిలాగే వుంది.

సర్‌ప్రైజ్ ఏమిటంటే, ఎదుర్కోలులో వాళ్ళు మా అందరికీ పానకం ఇచ్చి ఆహ్వానించడం, పానకం ఎలా చెయ్యాలో అడిగి శ్రద్ధగా చేసుకొచ్చారు.

గగన్ గౌరిపూజా, క్రిష్ణ కాశీయాత్రా, బావమరిది గెడ్డం కింద బెల్లం ముక్కపెట్టి, బతిమాలి, కాశీయాత్ర విరమింపచేసి తీసుకురావడం అన్నీ సరదాగా అయ్యాయి. నిజంగా ఆ పురోహితుడు వాశు దేవశర్మగారు వశిష్టుడిలా, అన్నీ పద్ధతిగా సరదాగా జరిపించారు. అనూ, శైలూ తెర సెల్లా పట్టుకుంటే, కొబ్బరి బొండాంతో గగన్ వచ్చి కూర్చుంది. అచ్చంగా 10.15 నిమిషాలకి వధూవరులు జీలకర్రా బెల్లం ఒకరి తలమీద ఒకరు పెట్టుకుని, భార్యా భర్తలయ్యారు.

తరువాత అందరి ఆశీర్వాదాలు తీసుకుని మంగళసూత్రాలకి, సూత్రధారణ జరిపించారు.

మేం తీసుకొచ్చిన  ఇడ్లీ మైసూర్ బజ్జీలతోపాటు, గుడిలో ఆడపెళ్ళివారు మా కాఫీ కౌంటర్ దగ్గరే చాయ్, పకోడీ, సమోసాలు పెట్టారట. మా వైపున అంతా తెలుగు పద్దతిలో వస్త్రధారణలో మెరిసిపోయారు.

అమ్మాయి మధుపర్కం కట్టుకోడానికి వెళ్ళింది. మాధురీ, శిరీషల సాయంతో జ్యోతులు వెలిగించి, చక్కగా, జ్యోతుల పళ్ళెంతో నేనూ, రమక్కా, మాధురీ, వెనుకగా వాళ్ళ అమ్మా, అక్కలూ, వదినలూ ఆ వెనుక గగన్ శోభాయమానంగా మళ్ళీ పీటలమీదకి వచ్చాక తలంబ్రాలూ, బిందెలో గగన్ మెట్టెలూ, మా వాడి ఉంగరం వేసి, ఎవరికి దొరుకుతుందో చూసే ఆటా, అరుంధతీ నక్షత్రం చూపెట్టడం అన్నీ యధావిధిగా జరిపించారు. వధూవరులకి హారతి ఇస్తుండగా, ఓ వింత జరిగింది.

అమ్మ షిరిడీలో కోతే భయ్యా అనే పెద్దాయనతో మాట్లాడుతూ "మీ ఆశీర్వాదం కావాలి" అంటే "నేను పెళ్ళికి వెళ్తున్నాను, బాబా కూడా వస్తారు" అన్నాడుట.

అలాగే ఆ గుడిలో, నిలువెత్తు సాయిబాబా విగ్రహం ముందు పెళ్ళి మొత్తం జరిగింది. హారతి ఇచ్చేలోగా బోలెడు గొంతులు ఏకతాళంతో "జయ జగదీశ హరే" అని మొదలు పెట్టారు చూస్తే జతలు జతలుగా అరవై ఏళ్ళు దాటిన వాళ్ళు. నేను ఆశ్చర్యపోతుంటే పురోహితుడు చెప్పాడు గురువారం రోజు వాళ్ళు ఈ విధంగా వచ్చి హారతి ఇచ్చాకే వెళ్ళి భోజనం చేస్తారని చెప్పారు. ఆరోజు గురువారం బాబాగారు తన ఉనికిని అలా మాకు తెలియచేసారు. ఓం సాయిరాం.

నిజంగా నా భర్తా, నేనూ పీటల మీద కూర్చుని సియాటిల్ వచ్చి ఈ విధంగా పెళ్ళి చెయ్యడం, షిరిడీలో వుండి పూజలు చేసిన మా అమ్మ పూజల ఫలితం. బాబావారి అనుగ్రహం కాక వేరొకటి కాదు.

"అన్నీ సర్దావా? అన్నీ తెస్తున్నావా?" అని ఒకరిని ఒకరిని అడుగుతూ మేం బట్టలు వున్న పెట్టె తీసుకురాకుండా వెళ్లడం, విష్ణు వచ్చి వీడియో కాల్‌లో పెట్టి చూపించి "ఇదా" అని తీసుకురావడం, లాంటి ఎన్నో  గడబిడలూ, సందడులూ మధ్య పెళ్ళి నిర్విఘ్నంగా, మంగళ ప్రదంగా అయిన వాళ్ళ మధ్య జరుపుకుని, అప్పటికే కేటరింగ్ వచ్చి వుండడంతో అందరం కార్లలో వియ్యాలవారింటికి వెళ్ళి పూర్ణం  బూరె, పులిహోరా, లడ్డూలతో తెలుగు భోజనం చేసాం.



పెళ్ళిలో క్రిష్ణ బాస్ డేవిడ్ పక్కన కూర్చుని శ్రీరామ్ వేగరాజు లడ్డూ, పెరుగులో కలుపుకుని తినడం మా ఆచారం అని తినిపించడం, అతను 'ఔను' అనుకుని తిని 'టూ డెలీషియస్' అనడం ఒక జోక్.

నేను వెళ్ళి "అలా తిన్నారా?" అని అడిగి వచ్చేసాను.

అతను క్రిష్ణతో "అలా తినకూడదా? మీ మదర్ చాలా అప్‌సెట్ అయ్యారా?" అంటే "అది ట్రెడిషన్‌కి విరుద్ధం, అయ్యో ఇప్పుడెలా?" అని క్రిష్ణా, వాడి ఫ్రెండ్స్ అతన్ని మరింతగా కంగారు పెట్టి, చివర్లో "జోక్ చేసాం ఏమీకాదు" అని చెప్పేసారు.

తెలుగు భోజనాలు తెప్పించినది మేం అయినా చక్కగా టేబుల్ మీల్స్ అరేంజ్ చేసి పెట్టింది ఆడపెళ్ళివారు.

ముఖ్యంగా హల్దీ, తెలుగుపెళ్ళి, అన్నీ వాళ్ళ బ్యాక్‌యార్డ్‌లో ఇంత హాయిగా జరగడానికి కారణం. ఆ సూర్యభగవానుడు.సియాటిల్‌లో ఆ ఎండలు రావడం, 'నేను చేసిన మేనిఫెస్టేషనే.' మార్చ్ నెలలో పెళ్ళి అయ్యాక మళ్ళీ వారం రోజులు ఎడతెరిపి లేని వానలు పడ్డాయి.

ఆ తరువాత రోజు 'జాగో' నైట్ అంటే కేవలం సంగీత్‌లా, వారి సంప్రదాయాల్ని అనుసరించి, పంజాబీ నృత్యాలు, మా క్రిష్ణ, వాడి ఫ్రెండ్స్ చేసిన 'నాటు నాటు ..నాటు, రంజితమే. రాను రాను అంటూనే పిల్లదీ అన్నీ పెద్ద హిట్స్. పిల్లలు శ్రమపడి చేసిన రిహార్సల్స్ అన్నీ వృధా పోలేదు. కానీ ఆడపెళ్ళి వారికి నృత్యం వెన్నతో పెట్టిన విద్య. నేను కూడా ఆ రోజు పంజాబీ మహిళల వస్త్రధారణలో మా వియ్యపురాలికి జోడీగా పసుపు పంజాబీ కుర్తా లెహంగాలో వెళ్ళి, నా కొడుకులిద్దరితో డాన్స్ చేసాను. ఎన్నటికీ మరువలేని సన్నివేశం అది.

మా మనవడు ధృవకి కూడా ఈ జాగోలో నృత్యాలూ, సందడీ బాగా నచ్చాయి. 91 ఏళ్ళ బీబీతో సహా, రాత్రి 12గంటలదాకా ఈ నాట్య హేల సాగింది.

మే 17న జాగో అలా ముగిసింది. తెల్లారి 18న గురుద్వారలో పెళ్ళి.

మా క్రిష్ణ నూటికి నూరు వంతులూ సర్దార్జీలాగే వున్నాడు. ఆ పగ్‌డీ, పఠాన్ డ్రెస్, చేతిలో కృపాణం, మీసాలూ, గెడ్డాలతో. గగన్‌ని చూడటానికైతే రెండు కళ్ళూ సరిపోలేదు. అంత బాగా ఎటైర్, అలంకరణా, హుందాతనంగా అమిరాయి.

గురుద్వార్‌లో వెళ్ళే ముందే చాలా సేపు మిలనీ జరిగింది. వాళ్ళ వాళ్ళందరూ పగిడీలు పెట్టుకుని వచ్చారు. మా వియ్యంకుడు పగిడీ పెట్టుకుంటే వాళ్ళవాళ్ళే గుర్తుపట్టలేదు. ఇటునుండి బావగారూ అటునుండి బావగారూ, అటునుండి మావయ్యా, ఇటునుండి మావయ్యా ఒకరిని ఒకరు కౌగలించుకోడం వాళ్ళు కవర్‌లో 'షగున్' 105 డాలర్స్ పెట్టి ఇవ్వడం... ఇలా బుద్దాడు వరకూ అటూ ఇటూ ఇంట్రడక్షన్స్ అయ్యాకా, 'గురూ' వచ్చి గురుబాణీతో లోపలికి తీసుకెళ్ళారు.



రుచిరకమైన పలహారాలు పెట్టారు. కానీ

ఆడవారికి ముసుగు జారకూడదు కంపల్సరీ. తరువాత సినిమాలోలా అమ్మాయి ముందు బ్రెయిడ్స్ మెయిడ్స్ లేత రోజా



రంగు బట్టల్లో రావడం, వెనుక ఆమె పెద్ద లెహంగాలో, మేలి ముసుగులో రాజకుమార్తెలా రావడం తరువాత గురుగ్రంధ్ సాహిబ్ చదవడంతో 'ఆనంద్ కర్జ్ ' సెర్మనీ జరిగింది.

క్రిష్ణనీ, గగన్‌నీ సంతకాలు చెయ్యమని భార్యాభర్తలుగా ఎనౌన్స్ చేసారు.

వాళ్ళు పిల్లాడికీ, మేం పిల్లకీ 'షగున్' ఇచ్చాం.

తరువాత లంగర్‌లో లంచ్. ఎంతో బావుంది. కానీ బ్రేక్‌ఫాస్ట్ అప్పుడే చేసి వుండడంతో ఎక్కువగా ఆకలి లేదు.

తర్వాత 'బిదాయీ' అంటే మన అప్పగింతల ముందు క్రిష్ణ చెప్పులు కొట్టేసే ముచ్చట మరదళ్లది.

అప్పటిదాకా కార్లో దాచిన చెప్పులు మా అశ్విన్ అప్పుడే తీసుకొచ్చి క్రిష్ణకి ఇవ్వగానే వరుసకి బావమరిది సాహిల్ వాడ్ని ఎత్తెయ్యడం, మరదలు చెప్పులు లాగెయ్యడం తృటిలో జరిగిపోయాయి. తరువాత బోలెడు డబ్బులు ఇస్తేకానీ తిరిగి ఇవ్వలేదు.

అమ్మాయీ, తల్లీ కారు ఎక్కేటప్పుడు కంట తడిపెట్టారు. అమెరికాలో పుట్టి పెరిగినా ఆడపిల్లే కదా! పుట్టింటిని వదిలి పెట్టడం బాధాకరం.

మరదలు క్రిష్ణ బుగ్గలు పొడవడం ఒక ఆచారం. అదీ జరిగాకా, వాళ్ళు హోటల్‌కి వెళ్ళారు.

సాయంత్రం లెన్‌వుడ్ రిసార్ట్స్‌లో రిసెప్షన్‌కి మళ్ళీ మేమందరంకూడా చీరలూ, డ్రస్సులూ మార్చుకుని వెళ్ళాలన్నమాట.



అలా సాయంత్రం రిసెప్షన్‌కి 6గంటలకల్లా బయలుదేరాం. పీపుల్స్ మీడియా అనే సినీ నిర్మాణ సంస్థ అధినేత శ్రీ విశ్వప్రసాద్‌గారినీ, వారి సతీమణి వందనగారిని కూడా మా శ్రీరామ్ మాధురీలతో నేనువెళ్ళి పిలవడంతో వాళ్ళూ రిసెప్షన్ కొచ్చారు. ఎంతోమంది నా ఆప్తులూ, కొంతమంది బంధువుల మధ్య రిసెప్షన్ జరిగింది.

మా వియ్యంకుడు ఒకరొకరర్నే తీసుకొచ్చి నాకు పరిచయం చేసి "నా దగ్గర మిత్రుడు" అని చెప్పడం, నేను లేచి నిలబడి నమస్కరించడం, ఆడవారిని కౌగలించుకోవడం కొన్ని వందలసార్లు అయింది. ఆయనకి మిత్రులు కొన్ని వందలమంది ఉన్నారు. పొద్దుట గురుద్వారాలో నీల్‌డౌన్ సాయంత్రం నాకూ మా వారికీ నిలబడడం, కూర్చోవడం. చాలా ఎక్సర్‌సైజ్ జరిగింది.

వారం రోజులు జాగోకి, రిసెప్షన్స్ కి డాన్స్ రిహార్సల్స్ విష్ణు బోయ్స్ అందరిచేతా చేయించి, చేయించి మరింత ఎఱ్రగా అయిపోయాడు.

'రంజితమే' పాటలో ఉన్న ఒక్క డైలాగ్ సరిగ్గా చెప్పలేక మా శైలు, లిప్ సింక్ ఇవ్వలేదని విష్ణు చేత చివాట్లు తింది.

మా అశ్విన్ రిహార్సల్స్ చెయ్యకుండా వాళ్ళు డాన్స్ చేస్తున్నప్పుడు, ఎగిరిన ఎగురుడుకి అనూ పాప్‌కార్న్ డాన్స్ అని పేరు పెట్టింది.

ఇంక డాన్స్ చేస్తుంటే అందరూ దిష్టి తీసిపోసిన డాలర్స్‌తో ఫ్లోర్ కనిపించలేదు. మా రమక్క "అయ్యో అయ్యో డబ్బులే" అంటూనే వుంది. అది వాళ్ళ సంప్రదాయం.. మనం బియ్యం తలంబ్రాలని నెత్తిన పోసుకున్నట్లు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచారం.

మావారూ నేనూ డాన్స్ చేస్తూ, ఈ వేడుకలలో పాలుపంచుకోడం ఆ సాయిబాబా దయ అయితే, మా డాక్టర్ మోహన్ వంశీ సహకారం కూడా. వారిని ఆ బాబా సదా చల్లగా చూడాలి. మా అమ్మా, మా ఆడబిడ్డల ఆశీర్వదాలు. క్రిష్ణ పెళ్ళి ఇంత అట్టహాసంగా పరాయి దేశంలో, ఊరుకాని ఊర్లో జరగడానికి దోహదపడితే... నా మిత్రులూ, మా క్రిష్ణ 'దోస్తు' బోయ్స్ మరీ మరీ కారణం. ఇన్ని కార్లు తోలుతూనే వున్నారు. కేటరింగ్ ఫుడ్ తెస్తూనే వున్నారు. మళ్ళీ డాన్స్ ప్రాక్టీసు చేస్తూనే వున్నారు. మా శైలూ, బాయ్స్ లేకపోతే ఇంత సందడి వుండేదేకాదు. మెనీ థాంక్స్ టు ఈచ్ ఎండ్ ఎవ్విరివన్ హూ పార్టిసిపేటెడ్ ఇన్ దిస్ ఈవెంట్ ఎండ్ సెంట్ విషెస్ ఫర్ దిస్ వెడ్డింగ్. భగవంతుడు గగన్, క్రిష్ణలకి ఆయురారోగ్య ఐశ్వర్యాలు ఇచ్చి కలకాలం కాపాడుగాక.

స్వస్తి.. శుభమస్తు...మంగళం మహత్

Post your comments







